క్లుప్తంగా

పుదూరు గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయురాలు

నాయుడుపేట: ఇంటర్నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఒలంపియాడ్‌లో పుదూరు బాలికల గురుకుల విద్యాలయ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం గురుకుల యాజమాన్యం బాలికలకు అభినందన సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రూత్ రమోల మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థినులు ఆర్ ఏంజల్, ప్రియ, ఎం శరణ్య, పి సింధూరి, జీ గౌతమి గత సెప్టెంబర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఒలంపియాడ్ పరీక్షలో ఏ ప్లస్ గ్రేడ్‌తో బంగారు పతకాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

వామపక్ష ఉద్యమాలు మోసపూరితం



గద్దర్ స్ఫూర్తి సంచిక ఆవిష్కరణలో రామచంద్రయ్య

నాయుడుపేట: వామపక్ష పార్టీలు చేసే ఉద్యమాలు మోసపూరితమైనవని ఏడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రయ్య ఆరోపించారు. నాయుడుపేట ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం గద్దర్ స్ఫూర్తి సంచిక ఆవిష్కరణలో భాగంగా జరిగిన బహుజన మేధావుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బహుజనులకు నిజమైన విముక్తి పొందాలంటే అంబేడ్కర్ చూపిన మార్గమే గొప్పదని చెప్పారు. గద్దర్ బహుజనల కోసం పలు ఉద్యమాలు, రచనలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు నాగరాజు, అంజనేయులు, రమణయ్య, వెంకటయ్య గోపాలయ్య, రా.జగోపాల్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ నారాయణ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని నాలుగో వార్డులో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులకు కౌన్సిలర్ ఎంఏ నారాయణ సోమవారం శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీజీఎంపీ కార్యక్రమంలో వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తడ: ఎంఈఓ కార్యాలయంలో మెసెంజర్‌గా పనిచేస్తూ మృతి చెందిన చంద్రబాబు కుటుంబానికి యూటీఎఫ్ నాయకులు సోమవారం రూ.1.15 లక్షల విరాళం ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీజే రాజశేఖర్ చేతుల మీదుగా ఈ మొత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జేవీవీ జిల్లా కార్యదర్శి చెంగయ్య, వెంకటేశ్వర్లు, రమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సలహాలు పాటించాలి



పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

సూళ్లూరుపేట రూరల్: రైతులు పంట సాగు సమయంలో వ్యవసాయాధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని ఏడీఏ అనిత తెలిపారు. మండలంలోని కోటపోలూరులో రైతులు వేస్తున్న వరినాట్లను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరినాట్లు వేసే సమయంలో రైతులు అంగుళం మేర నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఎల్లికి ఊరట

పెళ్లకూరు: మండలంలో సోమవారం కురిసిన వర్షంతో ఎల్లి పైర్లకు ఊరట కలిగింది. అర్థమాల, బంగారంపేట, చిల్లకూరు, జీలపాటూరు, అనకవోలు, రోసనూరు తదితర గ్రామాల్లో ఎడగారు పైర్లు సాగు చేస్తున్నారు. కొంత కాలంగా వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పలు ప్రాంతాల్లో ఎల్లి పైర్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో ఎండిపోతున్న ఎల్లి పైర్లుకు ఊరట లభించింది.

ఆనకట్ట కడగండ్లు

నేను కాళంగి నదిని. సూళ్లూరుపేట సబ్‌డివిజన్ తోబుట్టువుని. నా పై ఉన్న ఆనకట్టతో మూడు మండలాలను సస్యశ్యామలం చేస్తూ 8 వేల ఎకరాల సాగు జలధార గా విరాజిల్లుతున్నాను. అన్నదాతలంతా నన్ను తమ సొంత మనిషిలా చూస్తున్నారు. అయితే కొంత కాలంగా నా ఒంటికి గాయాలయ్యాయి. అవి పెద్దవి కాకుండా మాన్పితే నేను కర్షకుల కడుపు నింపాతాను. ఇదీ కాళంగి నది, ఆనకట్ట వేదన. దీనిపై ప్రత్యేక కథనం.

- కాళంగి నది ఆనకట్టకు లీకేజీ
- మరమ్మతులు చేస్తే పుష్కలంగా నీటి నిల్వ





కమ్మకండ్రిగ వద్ద కాళంగినదిపై ఉన్న ఆనకట్ట (ఇన్‌సెట్) లీక్ అవుతున్న ఆనకట్ట

దొరవారిసత్రం: కాళంగినదికి బ్రిటీష్ కాలం నుంచి మంచి ప్రాచుర్యం ఉంది. దొరవారిసత్రం మండలం తనియాలి పంచాయతీ కమ్మకండ్రిగ సమీపంలో కాళంగి నదిపై బ్రిటీష్ కాలంలో సుమారు 80 ఏళ్ల కిందట నిర్మించిన ఆనకట్ట ప్రస్తుతం దెబ్బతినింది. దీంతో ఆనకట్ట పలు చోట్ల నీరు లీకేజీలు అవుతోంది. సంబంధిత ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించి, మరమ్మతులు చేపడితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వచ్చే నీరు ఆనకట్టలో నిల్వ ఉంటుంది. రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయి. ఇలాగే వదిలిసే ఆనకట్ట మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆ ప్రాంత వాసులు, రైతులు వాపోతున్నారు.

బ్రిటీష్‌కాలం నాటి ఆనకట్ట

కాళంగినది తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని కాళంగి గ్రామం నుంచి మొదలై వివిధ గ్రామాలను కలుపు కుంటూ దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలు మీదుగా సుమారు 62 కిలోమీటర్లు పొడవున ప్రవహిస్తోంది. దీనిపై బ్రిటీష్ కాలంలో కమ్మకండ్రిగ వద్ద సుమారు 290 మీటర్లు పొడవున ఆనకట్టను నిర్మించారు. దీన్ని 1970లో ఇరిగేషన్ శాఖ అధికారులు అభివృద్ధి కింద మరమ్మతులు చేశారు. మళ్లీ 20 ఏళ్ల కిందట ఆనకట్ట ఎత్తు పెంచారు. ఆ తరువాత మరమ్మతులు నోచుకోలేదు. ప్రతి ఏడాది వచ్చే వరదలకు ఆనకట్ట స్థిరంగా ఉన్నప్పటికీ పలుచోట్ల నీరు లీకేజీ అవుతోంది. దీంతో సాగునీరు వృథా అవుతోందని రైతులు చెబుతున్నారు.

అన్నదాతలకు వరప్రసాదిని..కాళంగి

దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండల ప్రాంతాల్లో రైతులకు కాళంగి నది వరప్రసాదిని. ఈ నదీ పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో వేల ఎరాలకు సాగునీరు పుష్కలంగా అందడంతోపాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో రైతులకు సాగునీటి సమస్య, ప్రజలకు తాగునీటి సమస్య తీరుతోంది. కమ్మకండ్రిగ వద్ద ఉన్న ఆనకట్ట పరిధిలోని దొరవారిసత్రం మండలం తనియాలి, కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ, బూదూరు, కుప్పారెడ్డిపాళెం, వెదురుపట్టు తదితర గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో నీరు పుష్కలంగా చేరుతున్నాయి. తద్వారా 8 వేల ఎకరాలకుపైన వరి సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆనకట్టకు మరమ్మతులు చేసి, లీకేజీలను నివారించాలని ఆనకట్ట పరిధిలోని అన్నదాతలు కోరుతున్నారు. సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఇరిగేషన్‌శాఖ ఏఈ ఠాగూర్ వివరణ కోరగా కమ్మకండ్రిగ సమీపంలో ఉన్న ఆనకట్ట మరమ్మతులు కోసం సుమారు రూ.12 లక్షలతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు.

పొర్లుకట్ట సక్రమంగా లేదు



కాళంగి ఆనకట్ట వద్ద ఉన్న పొర్లుకట్ట పలు చోట్ల దెబ్బతింది. వరదల సమయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోని ఆందోళన చెందాల్సివస్తుంది. కమ్మకండ్రిగ సమీపంలో ఆనకట్ట కూడా శిథిలావస్థకు చేరింది. ఇది దెబ్బతింటే నదిలో చుక్కనీరు ఉండదు.

– ఎం మునస్వామి, రైతు కమ్మకండ్రిగ

మరమ్మతులు చేయాలి



కమ్మకండ్రిగ సమీపంలో కాళంగి నదిపై నిర్మించిన ఆనకట్ట శిథిలావస్థకు చేరినందున పలు చోట్ల ఆటకట్ట నుంచి నీరు లీకేజీ అవుతోంది. ఆనకట్టకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అప్పుడే సాగునీరు పుష్కలంగా ఉండి సాగుకు ఇబ్బంది ఉండదు.

– సీహెచ్ రమణారెడ్డి, రైతు, తనియాలి గ్రామం

ప్రత్యేక దృష్టి పెట్టాం



కాళంగినది అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఆనకట్టకు తొలుత సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ ఆనకట్ట నుంచి నెర్రికాలువ అభివృద్ధికి ఇప్పటకే రూ.26 కోట్లు నిధులు మంజూరు చేశాం. పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నిధుల నుంచే ఆనకట్ట అభివృద్ధి కోసం వెచ్చిస్తాం.

– కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

నాయుడుపేటటౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐలు వైవీ సోమయ్య, నరసింహరావు అన్నారు. అమరవీరులైన పోలీసుల స్మారక దినోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజలందరూ ప్రశాంతమైన జీవనం గడిపేందుకు పోలీసులు వారి ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రకళ, వైద్యులు, దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు, యువతకు డీఎస్పీ ప్రశంస పత్రాలు, బహుమతులను అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వైవీ సోమయ్య, నరసింహారావు, ఎస్‌ఐలు కే శ్రీకాంత్, డీ ఆదిలక్ష్మీ, జె తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



యువతకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సీఐ సంఘమేశ్వరరావు

సైదాపురం(వెంకటగిరి): రక్తదానం చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయవచ్చనని వెంకటగిరి సీఐ సంఘమేశ్వరరావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని సీహెచ్‌సీ వైద్యశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీఐ సంఘమేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలన్నారు. నేటి యువతరం దేశభక్తి పెంపొందించుకుని, ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నరసింహారావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాపూరు: పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి అన్నారు. కంబాలపల్లెలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సూర్యధర్మేంద్ర, మమత, మధుసూదన్, ప్రమీలారాజకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రమణీరెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ పాల్గొన్నారు.

దేశ ఉన్నతికి పాటుపడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాపూరు: దేశ ఉన్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర అన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లి సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఎర్త్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు శ్రీహరి, విశాలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాపూరులో వర్షం

రాపూరు: మండలకేంద్రంలో సోమవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయయ్యాయి. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో తల్లడిల్లిన ప్రజలకు ఉపశమనం లభించింది. వర్షానికి లోతట్టు ప్రాంతమంతా జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులకుగురయ్యారు. నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాపూరులో కురుస్తున్న వర్షం

సిద్ధవరంలో ఆరోగ్య సురక్ష

కోట: మండలంలోని సిద్ధవరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ దాసరి అంజమ్మ, ఎంపీడీఓ భవానీ ప్రారంభించారు. డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, రామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పోలమ్మ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఐదో వార్డు కాలేజీ మిట్టలో మంగళవారం ఉదయం 6.30 గంటల కు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.

పెరుమాళ్లపాడులో ...

సైదాపురం: ఊటుకూరు సచివాలయం పరిధిలోని పెరుమాళ్లపాడు, పొక్కుందల గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కండలేరులో 11.396 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 11.396 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడిగా చింతపూడి

పెళ్లకూరు: ఎస్సీ, ఎస్టీ సెల్ నాయుడుపేట పట్టణ ఉపాధ్యక్షుడిగా మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన చింతపూడి పవన్‌కళ్యాణ్ ఎన్నికైనట్లు విశ్వమానవ అధికార పరిషత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశ్వమానవ అధికార పరిషత్(ప్రపంచ మానవ హక్కుల సంఘం) ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ ఆ ఉత్తర్వులు అందుకున్నారు.

10 స్టార్టర్ల చోరీ

సైదాపురం: మండలంలోని పాతాళపల్లె 10 స్టార్టర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించారని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైవల్యాపది సమీపంలో ఉన్న పొలాల్లో 10 మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల స్టార్టర్లను పగలగొట్టి, వైర్లు చోరీ చేశారన్నారు.

యూనిఫామ్ వితరణ

గూడూరురూరల్: ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు ఎస్ఆర్‌ఐ సప్తగిరి చేపలపల్లి దాతృత్వంతో యూనిఫామ్‌ను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ ఉండాలనే ఉద్దేశంతో ఎస్ఆర్‌ఐ సప్తగిరిని కోరామన్నారు. ఆయన వెంటనే విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని ముందుకొచ్చి, యూనిఫామ్ అందించారన్నారు. అధ్యాపకుడు డాక్టర్ పి.నారాయణరాజు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరు సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని చెప్పారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, అవినీతికి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్, వైస్ ఎంపీపీ టీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ పెంచలయ్య, రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, టీ జగదీష్, జే మల్లికార్జున, టీ ప్రసాద్‌రావు, రవినాయుడు, ఎం సుబ్బారావు, విశ్వనాథ్, వైస్ సర్పంచ్ యారం గౌతమ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



తడ: మాట్లాడుతున్న తహసీల్దార్ జయజయరావు



చిల్లకూరు: సదస్సులో పాల్గొన్న అధికారులు

చిల్లకూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి పౌరుడు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అంకులపాటూరులో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో ప్రతి పౌరునికీ కొన్ని హక్కులు కల్పించారని, అయితే వీటిని కొంత మంది సక్రమంగా వాడుకోవడం లేదన్నారు. హక్కులను గురించి పూర్తిగా తెలుసుకోకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. ఈ హక్కులను అమలు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వం, అధికారులపై ఉంటుందన్నారు. ఆ హక్కులు ఏమిటనే విషయం ముందుగా సామాన్య ప్రజలు తెలుసుకోవాలనే సంకల్పంతో ఇలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల్లో చైతన్యం రావాలని, అందుకు ఒక్కటే మార్గం చదువు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను చదుకునేలా బడికి పంపించాలన్నారు. అలాగే బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయని, దీనిపై ప్రభుత్వం కూడా నిషేధం విధించిందన్నారు. నేడు ప్రభుత్వ పథకాలను పొందుకునేందుకు అవసరమైన ఆధార్ కార్డు, రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాదేవి, ఏపీఓ గిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్, సర్పంచ్ పీ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

తడ: ప్రతి పౌరుడూ పౌర హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జయ జయరావు తెలిపారు. మండలంలోని రామాపురం వైద్యశాల, గ్రామంలో ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహ కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు మస్తాన్, సర్పంచ్ కటారి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కె. నదియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కలువాయిలో లక్ష్మీనరసింహస్వామి రథం

కలువాయి: మండలకేంద్రంలోని కలువాయమ్మ ఆలయం వద్ద సోమవారం పెనుశిల నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వెంకటగిరి సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ధర్మప్రచార రథం సోమవారం కలువాయికి చేరుకుంది. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రథం స్థానిక నరసింహస్వామి ఆలయం వద్ద నుంచి బయలు దేరి పురవీధుల్లో సాగింది. అనంతరం కలువాయమ్మ ఆలయం ముంగిట ఏర్పాటు చేసిన మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, పెంచలకోన సహాయ కమిషనర్ కే జనార్దనరెడ్డి, ఈఓ వినోద్‌కుమార్, బి.కళ్యాణ్, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశిస్వామి, వినోద్‌స్వామి, సూర్యస్వామి, ప్రసాద్ స్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

దారి చూపించాలని రైతుల వినతి

చిల్లకూరు: పొలాలకు వెళ్లే దారి లేకుండా వెంచర్లు వేశారని, తాము పొలాలకు వెళ్లడానికి దారి చూపాలని నాంచారమ్మపేట, పెంటపాడు రైతులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు మూడు వైపులా దారులను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మూసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలో పబ్లిక్ బోరు, తాగునీటి బావి నిరుపయోగంగా ఉన్నాయన్న సాకుతో ఆ ప్రాంతంలోనూ లే అవుట్ వేశారని తెలిపారు. తెలుగు గంగ కాలువ మీదుగా పొలాలకు వెళదామన్నా అక్కడ కూడా కాలువపై కంప వేసి, దారి లేకుండా చేశారని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా దారులు చూపించేలా సర్వే చేసి, పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో తహసీల్దార్ పరిశీలించి, చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నేడు జగనన్న సురక్ష

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటా సర్వే చేసి, టోకన్లు ఇచ్చిన వ్యాధిగ్రస్తులు సురక్షలో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పనులు కల్పించండి

ఓజిలి: ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచి, అధికంగా పనులు కల్పించాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం క్షేత్ర సహాయకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులను ముమ్మరం చేయాలన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, బిల్లులు మంజూరైయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉషారాణి, టీఏలు మహేష్‌కుమార్, భార్గవి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.